


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 223 | శుక్రవారం 15- ఆగష్టు 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## మీ గెలుపును మీ కార్యకర్తలే నమ్మటం లేదు..



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు టీడీపీ నేతలకు పులివెందుల ఎన్నికలు కాంట్రాక్ట్ కి ఇచ్చినట్లు ఉన్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఆడవాళ్ళ ఓట్లు కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దొంగ ఓటర్లు వేసి వెళ్ళారు.. సిగ్గు, శరం లేకుండా బరితెగించి రాజకీయాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తొలగించిన 65 లక్షల ఓటర్ల జాబితాను బహిర్గతం చేయండి:

### - సుప్రీంకోర్టు



- బీహార్ ఓటర్ల జాబితా సవరణపై సుప్రీం అసంతృప్తి
- ఓటర్ల జాబితాలో అవకతవకలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు - ఈసీపై తీవ్ర వ్యాఖ్యలు
- జిల్లా స్థాయి వెబ్‌సైట్లలో తొలగించిన ఓటర్ల లిస్టు పెట్టండి
- బూత్ స్థాయిలో లిస్టు ఎందుకు బయట పెట్టలేదని సుప్రీం ప్రశ్న



- కాంగ్రెస్ పాలనతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పతనమవుతోంది
- జూన్, జులైలో తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి
- ప్రజలు అవసరాలకే ఖర్చు చేస్తున్నారు -ఆర్థిక వ్యవస్థ నిలిచిపోయినట్లు హెచ్చరించిన కేటీఆర్
- తెలంగాణను తిరోగమనంలోకి నెట్టిన కాంగ్రెస్: హెూప్‌లెస్ గవర్నెన్స్ అంటూ కేటీఆర్ ఫైర్
- ఇండస్ట్రియల్, ఐటీ, ఫార్మా రంగాలన్నీ కుదేలయ్యాయి
- ఆర్థిక సంక్షోభం నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి
- ఉద్యోగ కల్పనపై కాంగ్రెస్కు స్పష్టత లేదు
- తెలంగాణ అభివృద్ధి పునఃప్రారంభానికి ఆర్థిక సంస్కరణలు అవసరం: కేటీఆర్ సూచన

## కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే

# తెలంగాణలో ఆర్థిక సంక్షోభం

**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** వరుసగా రెండు నెలల పాటు తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి పోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి స్పష్టమైన నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్ల పాటు దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, కేవలం ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థికంగా చితికిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే తెలంగాణకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జులై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైందన్నారు. జులైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం -0.44శాతం ఉండగా, జాతీయ సగటు ం2.10శాతంగా ఉందని గుర్తు చేశారు. జూన్‌లో రాష్ట్రంలో -0.93శాతంగా ఉంటే, దేశవ్యాప్తంగా ం1.55శాతంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో డిప్లేషన్ (ద్రవ్యోల్బణం తగ్గుదల) మరింత తీవ్రంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల సంకేతాలు కావన్న ఆయన.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలన్నీ స్తంభించిపోయాయన్నారు. కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆర్థిక నిపుణుల సూచనలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు.

## బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి వివాదం.. ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు




**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** బంజారాహిల్స్ రోడ్ నెం. 12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని భద్రంగా భద్ర పరచాలని సూచించింది. విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది.

## బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు రూ. 240 కోట్లు..

## 20 రోజుల్లో రూ. 200 కోట్లు మాయం..!



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిధుల దుర్వినియోగంపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆడిట్ నిర్వహిస్తేనే నిధుల దుర్వినియోగంపై సీఐడీకి క్లారిటీ రానుంది. జగన్ మోహన్ రావు అధ్యక్షుడు అయిననాటి నుంచి బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు రూ. 240 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పుడు హెచ్‌సీఏ ఖాతాలో కేవలం రూ. 40 కోట్లు మాత్రమే ఉన్నట్లు సీఐడీ గుర్తించింది.

## ఎంత బాగా పనిచేస్తే అంత లాభాలు

- ప్రపంచ స్థాయి ఇంజినీరింగ్ కంపెనీగా ఏపీహెచ్ఎంఈఎల్‌ను తీర్చిదిద్దుదాం
- ఏపీహెచ్ఎంఈఎల్ సంస్థ అభివృద్ధికి త్వరలో కన్సల్టెన్సీ నియామకం
- ఎంత బాగా పనిచేస్తే అంత బాగా లాభాలు
- ఇబ్రహీంపట్నంలో ఏపీహెచ్ఎంఈఎల్ పరిశ్రమను సందర్శించిన డిప్యూటీ సీఎం, కీలక సూచనలు



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఏపీహెచ్ఎంఈఎల్(ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజినీరింగ్ లిమిటెడ్) ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నంలోని సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్ఎంఈఎల్‌ను సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడిభాగాలు తయారీ, పాత విడిభాగాలను మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజినీరింగ్ సంస్థలకు ఏపీహెచ్ఎంఈఎల్ కన్నా మించి మిషనరీ, మానవ వనరులు లేవని అన్నారు.

## రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తే.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు

### : ఎంపీ రఘునందన్‌రావు

- రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ విధానం ద్వారా ఎన్నికలు నిర్వహిస్తాం
- రాయ్‌బరేలిలో 2 లక్షల దొంగ ఓట్లు - రాహుల్ గాంధీ గెలుపుపై రఘునందన్ రావు తీవ్ర ఆరోపణలు
- ఈవీఎంలను తెచ్చింది కాంగ్రెస్‌నే - ఇప్పుడు వాటిపై అనుమానం ఎందుకు?
- బంగ్లాదేశ్ చొరబాటుకు మమత బాధ్యత వహించాలి
- కేటీఆర్‌కి ఎండదెబ్బ తగిలినట్లు మాట్లాడుతున్నారు - రఘునందన్ రావు



దేశానికి ప్రతిపక్ష నే**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** తగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం (రాజీవ్‌గాంధీ) ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది.

## ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

### : పొంగులేటి



## దమ్ముంటే డిబేట్‌కు రండి!



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** ఏ రాష్ట్రంలో రాని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తుందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. గతం కన్నా ఎక్కువ తెలంగాణకు కేంద్రం ఇచ్చిందని, ఇంకా కొంత మొత్తమే ఇవ్వాల్సి ఉందన్నారు. యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు అని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుందని ఎద్దేవా చేశారు. యూరియా కొరతపై తాను డిబేట్‌కు సిద్ధం అని, దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రండని రాంచందర్ రావు సవాల్ విసిరారు.

## రేవంత్ సర్కార్ విఫలం అయింది : హరీష్ రావు



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి కాంగ్రెస్ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక నిర్వహణలో వైఫల్యం చెందారని.. ఆయన ఆరోపించారు. రాష్ట్రం ప్రమాదకర ద్రవ్యోల్బణ స్థాయిలోకి ప్రవేశించిందని తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు.

తెలంగాణ వరుసగా రెండో నెల కూడా ద్రవ్యోల్బణంలోకి జారుకుందని హరీష్ రావు చెప్పుకొచ్చారు. ఆర్థిక వ్యవస్థ రివర్స్ గేర్‌లో ఉందనడానికి ఇది ప్రమాదకరమైన సంకేతమని తెలిపారు. డిమాండ్ కుప్పకూలిపోతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్క నుండి చూస్తోందని విమర్శించారు.



## మీ గెలుపును మీ కార్యకర్తలే నమ్మటం లేదు..

**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు టీడీపీ నేతలకు పులివెందుల ఎన్నికలు కాంట్రాక్ట్ కి ఇచ్చినట్లు ఉన్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఆడవాళ్ళ ఓట్లు కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దొంగ ఓటర్లు వేసి వెళ్ళారు.. సిగ్గు, శరం లేకుండా బరితెగించి రాజకీయాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దొంగల్లో కూడా పూలు, సైకిళ్ళు మాత్రమే.. గ్లాస్ వాళ్లను వదిలేసినట్లున్నారని పేర్కొన్నారు. రాష్ట్రానికి మంత్రి, రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్ రెడ్డి పోలింగ్ స్టేషన్ లోకి ఎలా వెళ్లారు అని ప్రశ్నించారు. మేం పత్తి వ్యాపారం చేయటానికి వెళ్ళమన్న డీఐజీకి వీళ్ల పత్తి వ్యాపారం కనిపించలేదా.. మంత్రి మనుషులు దాడులు చేసినా కేసులు ఎందుకు కట్టలేదు అని పేర్నినాని అడిగారు.

ఇక, ఎన్నికల కమిషన్ కు కళ్ళులేవా.. ఇవన్నీ కనిపించటం లేదా అని మాజీమంత్రి పేర్నినాని క్వశ్చన్ చేశారు. మంత్రి దగ్గరుండి పోలింగ్ ఏజెంట్లను బయటకు లాక్కెళ్లారు.. చిన్న చిన్న తప్పులకు కౌన్సిలింగ్ ఇచ్చే పోలీసులు తప్పులు చేస్తే కౌన్సిలింగ్ ఇవ్వాలి కదా.. బరితెగించిన వాళ్లను వదిలేసి.. ఇంట్లో కూర్చున్న మా ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేశారు.. జిల్లా కలెక్టర్ జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన వీడియోలను ఎక్స్ లో పెట్టుకున్నారు.. అంత ధర్మబద్ధంగా ఎన్నికలు చేశామని ట్వీట్ చేసి ఎందుకు తీసేశారు.. ఆయన ముందే దొంగ ఓట్లు వేసింది అర్థమైంది కాబట్టే ట్వీట్ తొలగించారు.. మీరు ట్వీట్ ఎందుకు డిలీట్ చేశారు.. డ్రామాను రక్తి కట్టించడానికి 30 ఏళ్ల తర్వాత ఓటు వేస్తున్నాం థాంక్స్ అనే స్లిప్పులు పెట్టారు.. దొంగ ఓట్లు వేయించేందుకు థాంక్స్ చెప్పారా అని పేర్నినాని ప్రశ్నించారు. అయితే, ఎవరు ఎవరికీ దండాలు పెట్టారు.. నారా లోకేష్ చేసిన ట్వీట్ లో కూడా ఇదే తరహాలో పెట్టారని పేర్నినాని అడిగారు. ఆయన పెట్టిన ట్వీట్ లో కూడా క్యూలో దొంగ ఓట్లు వేసే వ్యక్తి ఉన్నారు.. దొంగ ఓట్లు వేయించి పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని లోకేష్ బ్రతికించారట.. గతంలో మేం కుప్పంలో గెలిచిన సందర్భంలో మీలా మాకు మెజారిటీలు రాలేదు.. మావి గుద్దుకున్న ఓట్లు కాదు కదా అని ఎద్దేవా చేశారు. టీడీపీ వాళ్ళు 683 మంది వైసీపీకి ఓట్లు వేశారని గుర్తు చేశారు. మా వాళ్ళు ఓటింగ్ కు వెళ్లలేకపోయారు.. శత్రువు గుర్తుకు మీరు ఓట్లేశారు.. మీరు ఈ ఎన్నిక వల్ల ఏం సాధించారు.. 164 సీట్లతో ప్రభుత్వాన్ని పెట్టుకుని ఒక చనిపోయిన వ్యక్తి జెడ్పీటీసీ స్థానం కోసం పాకులాట ఎందుకు అని మాజీమంత్రి పేర్నినాని ప్రశ్నించారు. గతంలో మీ ప్రభుత్వం 23 మంది మా ఎమ్మెల్యేలను కొనుక్కున్నారు.. జగన్ నాయకత్వాన్ని తగ్గించగలిగారా అని వైసీపీ నేత పేర్నినాని క్వశ్చన్ చేశారు. ఆయన 151 సీట్లతో అధికారంలోకి వచ్చారు.. మీకు స్వేచ్ఛగా ఎన్నికలు నడిపే ధైర్యం లేదు.. మీరు ఈ 14 నెలల కాలంలో ప్రజలకు మంచి చేసి ఉంటే భయం ఎందుకు.. ప్రజలను స్వేచ్ఛగా ఓటు వేయించి ఉంటే ప్రజలు వాతలు పెట్టి ఉండేవారు.. ఇది ఎన్నిక కాదు.. ఇది ఎలక్షన్ కాదు.. మీకు ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారు.. పోలీసులను అడ్డం పెట్టుకున్న బ్రిటీష్ రాజ్యం పతనం అయినట్లే మీ ప్రభుత్వం కూడా పతనం కావడం ఖాయం.. న్యాయపరంగా.. చట్టపరంగా మేం పోరాటం చేస్తాం.. గత ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే 12 శాతం అదనంగా ఓట్లు లెక్కించారు.. దాదాపు 48 లక్షల తేడా ఉంది.. మమ్మల్ని చూసి ఇవాళ చాలా మంది ఈవీఎంలపై మాట్లాడేందుకు బయటకు వస్తున్నారని పేర్నినాని వెల్లడించారు.

## ఎంత బాగా పనిచేస్తే అంత బాగా లాభాలు

సంస్థలో పనిచేసే అధికారులు, కార్మికులకు నిబద్ధత అవసరమని, తాము సైతం ప్రపంచంతో పోటీ పడగలమని నిరూపించాలని సూచించారు. ఈ సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీని నియమిస్తామని చెప్పారు.

స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని.. దాని ఆధారంగా ఏ తరహాలో ముందుకు పోవాలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అధికారులు, సిబ్బంది ఎంత బాగా పనిచేస్తే అంత బాగా లాభాలు సాధిస్తామని.. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని.. రాష్ట్రాల ప్రగతికి దోహదపడవచ్చు అని తెలిపారు. సంస్థను, ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచాలని.. యంత్రాలకు ఓవరాలింగ్ చేయాలని.. రంగులు వేయాలని ఆదేశించారు. సిబ్బంది భద్రతా చర్యలు పాటించాలని.. కార్మికుల శ్రమ, ఉన్నత ఆలోచనలతోనే ఈ పరిశ్రమ ముందుకు పోతుందని తెలిపారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్‌కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మతు వరకే పరిమితం కాకుండా దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకొని బీహెచ్ఈఎల్ మాదిరి పనిచేస్తుందని తెలిపారు. థర్మల్ పవర్ స్టేషన్స్‌కు అవసరమైన యంత్రాలు, యంత్రాల మరమ్మతు చేస్తుందని, ఈ సంస్థను భవిష్యత్తులో ఏ విధంగా అభివృద్ధి చేయాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి చైర్మన్, ఎండీ బలరామ్, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే తెలంగాణలో ఆర్థిక సంక్షోభం: కేటీఆర్

ఒకప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇప్పుడు తిరోగమనంలోకి వెళ్లడం బాధాకరమని.. క్లూలెస్ కాంగ్రెస్ పాలనలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందని.. హోప్‌లెస్ గవర్నమెంట్, హోప్‌లెస్ గవర్నెన్స్ అంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆశలు చూపించి మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రభుత్వం దగ్గర ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక లేదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకెళ్లిందని, ఇప్పుడు ఆ రంగాలన్నీ కుదేలయ్యాయని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం వెంటనే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి పోకుండా ఉండడానికి తక్షణమే ఆర్థిక సంస్కరణలు, ఉద్యోగ కల్పన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించాలని సూచించారు. లేకపోతే, తెలంగాణ ఆర్థిక భవిష్యత్తు మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం మళ్లీ పురోగతి పథంలో నడవాలంటే, ప్రభుత్వం తన వైఫల్యాలను సరిదిద్దుకోవాలని కేటీఆర్ హితవు పలికారు.

## బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి వివాదం.. ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు




**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** బంజారాహిల్స్ రోడ్ నెం. 12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని భద్రంగా భద్ర పరచాలని సూచించింది. విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది. గతంలో పెద్దమ్మ గుడి కూల్చివేతపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ నమోదైంది. అక్రమంగా కూల్చిన ఆలయాన్ని తక్షణమే నిర్మించాలని పల్లె వినోద కుమార్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన న్యాయస్థానం విగ్రహాన్ని భద్రపరిచి.. కూల్చితేలకు గల ఆధారాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మగుడి కూల్చివేతపై కొద్ది రోజులుగా వివాదం సాగుతుంది. కూల్చివేతకు నిరసనగా హిందూ సంఘాలు కుంకుమార్చాన పూజకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. హిందు సంఘాల పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌కు వెళ్లే అన్ని మార్గాలను మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్దమ్మగుడి దగ్గర భారీగా పోలీసులను మోహరించారు. పెద్దమ్మ తల్లి దేవాలయానికి వెళ్లే మార్గాన్ని పూర్తిగా అదుపులోకి తీసుకున్నారు.

## బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు రూ. 240 కోట్లు.. 20 రోజుల్లో రూ. 200 కోట్లు మాయం..!

20 నెలల్లో రూ. 200 కోట్లు ఖర్చు చేసింది హెచ్‌సీఏ. దేని కోసం ఖర్చు చేశారో బయట పడాలంటే ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని సీఐడీ భావిస్తోంది. 2014 నుంచి హెచ్‌సీఏ అక్రమాలపై ఇప్పటికే రెండు సార్లు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించారు. తాజాగా సీఐడీ సిఫార్సుతో మరోసారి హెచ్‌సీఏలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించారు.

హెచ్‌సీఏ నిధుల గోల్‌మాల్ కేసులో నకిలీ బిల్స్‌తో బీసీసీఐ గ్రాంట్లు, హెచ్‌సీఏ నిధులను నిందితులు కొల్లగొట్టినట్లు సీఐడీ అధికారుల దర్యాప్తులో తేలినట్లు ఇటీవల అధికారులు తెలిపారు. హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్ రామ్‌చందర్ నుంచి సీఐడీ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న దేవరాజ్‌ను గత నెల 25న పుణెలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కోర్టు అనుమతితో ఈ నెల 7 నుంచి 13 వరకు కస్టడీలోకి తీసుకుని విచారించారు

## తొలగించిన 65 లక్షల ఓటర్ల జాబితాను బహిర్గతం చేయండి: సుప్రీంకోర్టు



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై మరోసారి సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం ఏదైతే ఓటర్లను తొలగించామని చెప్పిందో.. ఆ 65లక్షలకు పైగా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అదే సమయంలో వారిని ఎందుకు తొలగించారో పేర్కొంటూ వివరణతో కూడిన ఆ లిస్టును పబ్లిక్‌లోకి తీసుకురావాలని పేర్కొంది ధర్మాసనం. ఈ అంశానికి సంబంధించి గురువారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. 22 లక్షల మందిని చనిపోయారన్న కారణంతో తొలగించడాన్ని సైతం? ప్రశ్నించింది. బూత్ లెవెల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. పౌరుల హక్కు రాజకీయ పార్టీలపై ఆధారపడటం మాకు ఇష్టం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

'భారత ఎన్నికల కమిషన్ వాదనలను మేము పూర్తిగా విన్నాం. విచారణ సమయంలో, ఈ క్రింది దశలను అంగీకరించారు. 2025 జాబితాలో పేర్లు కనిపించినప్పటికీ, తాజాగా జాబితాలో చేర్చబడని 65 లక్షల మంది ఓటర్ల జాబితాను జిల్లా స్థాయి వెబ్‌సైట్‌లలో ప్రదర్శించాలి' అని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది.

కాగా, బీహార్లో ఎన్నికల సంఘం హడావుడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. మరోవైపు ఈ జాబితా సవరణలోని లోపాలు ప్రతీ రోజూ బయటపెడుతూనే ఉన్నాయి. వీటిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయ.

మరొకవైపు ఈసీ తన నిర్ణయాన్ని సమర్ధించుకుంటూ, అనర్హులైన ఓటర్లను తొలగిస్తూ, ఓటర్ల జాబితాను శుద్ధి చేసేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు వివరణ ఇస్తూ వస్తోంది.. అయితే ప్రతిపక్షాలు ఈ ఓటర్లు జాబితా సవరణ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఇంతలో లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మహారాష్ట్ర, కర్నాటకలలో ఓటర్ల జాబితాలో ఓట్ల చోరీని ఆధారాలతో సహా బయటపెట్టడంతో పాటు బీహార్ లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపైనా పలు విమర్శలు గుప్పిస్తున్నారు.

## మీరేమైనా యుద్ధానికి వెళ్తున్నారా?.. వాహనాలకు ఆ రంగులేంటి?




**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నంబర్ 37, 38/1లో 1.07 ఎకరాల భూమిపై ఎందుకంత దూకు డుగా వెళు న్నారని హైడ్రా (హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తి సంరక్షణ విభాగం) కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు స్టేటస్‌కో ఆదేశాలు పాటించాలని చెప్పినా వినకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని, కొందరు దీన్ని వాడుకుని ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పేర్కొంది. చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణ పేరుతో ప్రజలను అవస్థలకు గురిచేయడం, హడావుడి చేయడం ఎందుకని ప్రశ్నించింది. సరిహద్దుల్లో యుద్ధానికి వెళ్తున్నట్లు వాహనాలకు ఆ రంగులేంటని అడిగింది. ఇలానే చట్టవిరుద్ధంగా, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తే కోర్టుకు రప్పించి.. కఠిన శిక్షలు విధించడానికి వెనుకాడబోమని తేల్చిచెప్పింది. తన భూమిలో హైడ్రా చట్టవిరుద్ధంగా జోక్యం చేసుకుంటోందంటూ జూబ్లీహిల్స్‌కు చెందిన ఎస్.వెంకటేశ్వర్‌రావు ఏప్రిల్ 23న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై మరో ఇద్దరు పిటిషన్లు వేశారు. మొత్తంగా 6 ఎకరాల భూమి తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉందంటూ హైడ్రా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు.

ఎఫ్‌టీఎల్ నిర్ధారించారా?

హైకోర్టు ఏప్రిల్ 23న ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ హైడ్రా తమ భూమిలో జోక్యం చేసుకునేందుకు యత్నిస్తోందని జూన్ 11న వెంకటేశ్వర్‌రావుతోపాటు మరో ఇద్దరు ధిక్కరణ పిటిషన్లు వేశారు. వీటిపై బుధ వారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మా సనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున న్యాయవాది తరుణ్ జి.రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కోర్టు స్టేటస్‌కో ఆదేశాలు ఇచ్చినా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ లెక్కచేయలేదని, తమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ధారించకుండానే దూకుడుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వాదన లు విన్న న్యాయమూర్తి.. హైడ్రా కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అధికారులు.. హడావుడి నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తు న్నారన్నారు. తాము నిలుపుదల ఆదేశాలు ఇవ్వని చెరువులున్న ప్రాంతాల్లో మునకపై ఏ చర్యలు తీసుకున్నారని, ఎఫ్‌టీఎల్‌పై ఇప్పటివరకు విధాన పరమైన నిర్ణయం తీసుకున్నారా అని నిలదీశారు. అనంతరం విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

## దమ్ముంటే డిబేట్‌కు రండి!

'ఏ రాష్ట్రంలో రాని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తుంది. యూరియాను గతం కన్నా ఎక్కువగా తెలంగాణకు కేంద్రం ఇచ్చింది. ఇంకా కొంత మాత్రమే ఇవ్వాల్సి ఉంది. యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారు. కేంద్రం రైతులకి మేలు చేస్తుంది. కాంగ్రెస్ మాత్రం రైతులకు ద్రోహం చేస్తుంది. ఎరువులు ఎటు వెళ్తున్నాయో దమ్ముంటే దర్యాప్తు చేయండి, లేదంటే సీబీఐకి అనుమతి ఇవ్వండి. దర్యాప్తుకు ఇవ్వడానికి ఈ ప్రభుత్వంకు దమ్ము లేదు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలోకి వస్తే అక్కడ ఆ పార్టీ నాయకులే దళారులు. నాయకులే బ్లాక్ మార్కెట్ చేస్తారు. ఏ రాష్ట్రానికి ఎంత కోటా అనేది ముందే ఫిక్స్ అయి ఉంటుంది. బీఆర్ఎస్ ఆరోపణలు కరెక్ట్ కాదు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుంది. నేను డిబేట్‌కు సిద్ధంగా ఉన్నా, దమ్ముంటే రండి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు.

## ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: పొంగులేటి



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.

## రేవంత్ సర్కార్ విఫలం అయింది : హరీష్ రావు

**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి కాంగ్రెస్ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక నిర్వహణలో వైఫల్యం చెందారని.. ఆయన ఆరోపించారు. రాష్ట్రం ప్రమాదకర ద్రవ్యోల్బణ స్థాయిలోకి ప్రవేశించిందని తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు.

తెలంగాణ వరుసగా రెండో నెల కూడా ద్రవ్యోల్బణంలోకి జారుకుందని హరీష్ రావు చెప్పుకొచ్చారు. ఆర్థిక వ్యవస్థ రివర్స్ గేర్‌లో ఉందనడానికి ఇది ప్రమాదకరమైన సంకేతమని తెలిపారు. డిమాండ్ కుప్పకూలిపోతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్క నుండి చూస్తోందని విమర్శించారు. ఆరోగ్యకరమైన వృద్ధిని నిర్ధారించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ కూడా ద్రవ్యోల్బణాన్ని 2-6శాతం మధ్య ఉంచాలని లక్ష్యంగా పెట్టుకుందని సూచించారు. కానీ తెలంగాణ ఇప్పుడు 0 శాతం కంటే తక్కువగా ఉందని వివరించారు. గ్రామీణ, పట్టణ ద్రవ్యోల్బణం జూన్‌లో -0.93% ఉంటే.. జూలైలో -0.44% కు పడిపోయిందని పేర్కొన్నారు. ఇది విజయం కాదు.. ఇది ఆర్థిక రెడ్ అలర్ట్ ఆయన స్పష్టం చేశారు.

## మన ఊరు - మన బడి నిధులు విడుదల చేయండి.. సీఎం రేవంత్‌కు మండలి చైర్మన్ లేఖ



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేయాలని లేఖ ద్వారా సీఎంను గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తనని కలిసి వారి పరిస్థితిని వివరించుకున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో మన ఊరు– మన బడి కార్యక్రమం కింద సివిల్ పనులు పూర్తయ్యాయని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు దీనిని ధృవీకరించారని, రాష్ట్రం అంతటా మన ఊరు–మన బడి కార్యక్రమం కింద పూర్తయిన సివిల్ పనులకు పెండింగ్ బిల్లులు రూ.361.350 కోట్లు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల (స్కూల్ పేరెంట్స్ కమిటీ) అవసరాలను తీర్చడం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య కాబట్టి, పెండింగ్‌లో ఉన్న రూ.361.350 కోట్ల బిల్లులను విడుదల చేయాలని కోరారు. చిన్న, పేద కాంట్రాక్టర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు చేతి రుణాలు తీసుకుని ఈ పనులను పూర్తి చేశారని, బిల్లులు రాకపోవడంతో నేడు వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన లేఖలో తెలిపారు. పైన పేర్కొన్న పరిస్థితుల దృష్ట్యా, మన ఊరు– మన బడి పథకం కింద రాష్ట్రం అంతటా పూర్తయిన సివిల్ పనులకు సంబంధించిన రూ.361.350 కోట్ల పెండింగ్ బిల్లులను అత్యంత ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని ముఖ్యమంత్రిని లేఖ ద్వారా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభ్యర్థించారు.

## రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తే.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు

రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తాం. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు. బీహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నాం.

బెంగాల్‌లో డైమండ్ హార్బర్‌నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయి. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండ దెబ్బ కొట్టి తిక్క తిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం" అని రఘునందన్‌రావు అన్నారు.

## ప్రమాదకరస్థితికి తెలంగాణ ద్రవ్యోల్బణం

**: మాజీ మంత్రి హరీశ్‌రావు**



**న్యూస్ డెస్క్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం ప్రమాదకర స్థితికి చేరుకుందన్నారు. ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో వెళ్తోందనడానికి ఇదో ప్రమాదకర సంకేతమని.. రేవంత్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందని ఆక్షేపించారు. ప్రభుత్వ తప్పిదాలే దీనికి కారణమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

"ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదు. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవాలంటే ప్రజల చేతుల్లో డబ్బు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ మూలధన పెట్టుబడి నిరంతరం తగ్గుతోంది. మూసీ, హైడ్రా వంటి నిర్ణయాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీశాయి. వేలాది మంది ఉపాధి అవకాశాలపై ఇవి ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రధాన ప్రాజెక్టులు చేపట్టడం, ప్రజలకు డబ్బు అందుబాటులోకి తీసుకురాకపోవడం చేస్తే ద్రవ్యోల్బణం మరింతగా దిగజారి మాంద్యంలోకి వెళ్లే ప్రమాదముంది. సీఎం రేవంత్‌రెడ్డి మేలుకోవాలి.. ప్రతీకార రాజకీయాలు కాకుండా ప్రజల గురించి ఆలోచించాలి" అని హరీశ్‌రావు అన్నారు.

# చెస్ ఛాంపియన్ నార్లపాటి



**ఖమ్మం లీగల్, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** 79వ స్వాత్రంత్ర దినోత్సవం సందర్బంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీలలో ఛాంపియన్ గా ప్రముఖ న్యాయవాది నార్లపాటి అరుణ్ కుమార్ నిలిచారు. న్యాయవాద చెస్ క్రీడాకారులు 30 మంది చెస్ క్రీడాలో పాల్గొనగ తన మేధస్సు తో చదరంగం ఆట ఆడి తనదైన శైలిలో పావులు కదుపుతూ చెస్ అభిమానుల మనసులు చూరగోన్నాడు. ఈ చెస్ పోటీలకు ఇంద్రాచారి అద్దంకి ప్రవీణ్ లు నిర్వాహకులు గా వ్యవహారించారు. చెస్ ఛాంపియన్ ను బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు ప్రధాన కార్యదర్శి గద్దల దిలీప్ కుమార్ క్రీడాకార్యదర్శి కే వీ వీ లక్ష్మి సీనియర్ జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలియజేసారు. నేడు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ద్వారా బహుమతి నార్లపాటి అందుకోనున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ



**హైదరాబాద్ బ్యూరో, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధిలో స్ఫూర్తిదాయక పాత్ర పోషించాలని సూచిస్తూ, ఐక్యత, సౌభ్రాత్రతతో ముందుకు సాగితేనే శాంతి, సామరస్యంతో పాటు దేశ ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని, విజ్ఞానం%-%సాంకేతికతలో భారత్ ముందంజలో కొనసాగాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు దేశ బలమని గుర్తుచేస్తూ, గ్రామీణాభివృద్ధి ద్వారానే నిజమైన స్వాతంత్ర్యం ఫలిస్తుందని తెలిపారు. ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించాలని, దేశభక్తి మన హృదయాల్లో నింపుకోవాలని సూచించారు. భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ, అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# దేశంలో బిజెపి నియంత పాలన

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్



**ఖమ్మం బ్యూరో, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** ఈ దేశ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓటరు జాబితాలో జరిగిన అవకతవకలు, ప్రజలకు ఓటరు జాబితా సాఫ్ట్ కాపీ అందుబాటులో ఉంచాలని అడిగినందుకు ఆయనపై పోలీసు కేసులు నమోదు చేస్తున్నారని అందుకు నిరసనగా ఖమ్మం జిల్లా కేంద్రంలో ఏఐసిసి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బతికి ఉన్నవారిని చనిపోయినట్లుగా, ఉన్న ఓటర్లను లేనట్లుగా చూపిన ఓటరు లిస్ట్ పై సమగ్ర దర్యాప్తు జరపాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని తెలిపారు. ఎన్నికల కమిషన్ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ వైఖరి పై వాస్తవాలు వివరించేందుకు దేశవ్యాప్తంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడడం అంటే ఓటు హక్కును కాపాడుకోవడమే, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అని డిప్యూటీ సీఎం వివరించారు. ఇవాళ దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి కూటమి ఏదో రకంగా రాజ్యాంగానికి తూట్లు పొడిచి నియంత పాలన ఈ దేశంలో తీసుకురావాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బిజెపి పాలన తీరు ప్రజాస్వామ్యం పై దాడి, స్వతంత్రంగా వ్యవహరిం చాల్సిన, రాజ్యాంగ స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బిజెపికి లొంగిపోయి వాస్తవాలు బయటపెట్టడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఈ దేశంలోని ప్రతి పౌరుడు ముందుకు రావాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి పార్టీ నేతలు కొవ్వొత్తులతో జడ్పీ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.



# బీసీలకు బిజెపి వ్యతిరేకం

### బిజెపి దొంగ ఓట్లను సృష్టించి మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం

### సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం బ్యూరో, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** బీసీలకు బిజెపి వ్యతిరేకం బిజెపి దొంగ ఓట్లను సృష్టించి మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి కేంద్ర ప్రభుత్వం అని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గుమస్తాల సంఘం భవనంలో బీసీలకు తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకి సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కులగనన చేపట్టిన తర్వాత బీసీలు 42 శాతం ఉన్నారని లెక్కలు తేల్చి చెప్పింది. అంతే కాకుండా అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపించడం జరిగింది. కానీ అక్కడున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం దానిని పార్లమెంట్లో పెట్టి ఆమోదం పొందకుండా కాల యాపన చేస్తున్నారు. అంతేకాకుండా 42 శాతం లో ముస్లింలు ఉన్నారని సాకు తోటి బీసీ రిజర్వేషన్ ని బిజెపి అడ్డుకుంటుంది బిజెపి ఎప్పుడు కూడా మైనార్టీ ప్రజలు ఉన్నచోట అది ముస్లింలు ఉన్న చోట హిందువులకు ముస్లింలకు మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తూ ఉంటుంది. అలాంటి బిజెపి 42 శాతం లో 10% గా ఉన్న ముస్లిములు మరి అత్యధికంగా ఉన్న హిందువులను ఎందుకు కాదంటుంది ఇది ప్రజలందరూ గమనించాలి. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో బిజెపి బలపడాలంటే ముస్లింలను అన్ని విధాలుగా దెబ్బతీయాలని ముస్లింలను బూచీలుగా చూపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తా ఉంది ప్రతి ఎన్నికల్లో కూడా ముస్లింల మధ్య హిందువుల మధ్య గొడవలు పెట్టడానికి ఎన్నికలలో ప్రచారహస్త్రాలుగా ఉపయోగించుకుంటుంది బిజెపి. కాబట్టి ఏదైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ ఉందో దానిని వెంటనే అమలు చేయాలని పార్లమెంట్లో ఆమోదింప చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ దొంగ ఓట్లు సృష్టించి అధికారంలోకి వచ్చిండు అని ఇప్పుడు సాక్షాదారాలతో సహా తేటతెల్లమవుతుంది. ఇప్పుడు బీహార్ లో ఎన్నికలు వస్తున్నాయి అని చెప్పి అక్కడ బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లు అన్నింటిని తొలగిస్తా ఉంది సుమారు 65 లక్షల ఓట్లను ఆయా ప్రాంతాలలో తీసి వేసుకుంటూ వస్తుంది అంతేకాకుండా కేంద్ర ఎలక్షన్ కమిషన్ కూడా తన చెప్పు చేతల్లో ఉంచుకొని తను చెప్పినట్టు నడుచుకుంటూ ఎలక్షన్ కమిషన్ కూడా బిజెపికి అనుకూలంగా పనిచేస్తూ వస్తుంది ఇది ప్రజాస్వామ్య దేశం ఈ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల కమిషన్ ఎవరికీ తొత్తుగా వ్యవహరించకూడదు కానీ ఇప్పుడున్న ఎలక్షన్ కమిషన్ బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తూ వస్తుంది ఇది చాలా ప్రమాదకరం దేశానికి . అంతేకాకుండా ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్లను తొలగిస్తూ ఓటుని మళ్లీ నిరూపించుకోవాలంటూ ఆధార్ గుర్తింపు కార్డు గాని ఓటర్ గుర్తింపు కార్డు గాని పనిచేయదని తాను స్థానికంగా ఉన్నట్టు తన తాతల తండ్రులు దగ్గర్నుంచి బర్త్ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని చెపుతా ఉంది. ఇలా చెప్పటం వెనుక కుట్ర దాగి ఉందని ఇది ప్రజల గమనిస్తున్నారని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించే వరకు పార్లమెంటులో ఆమోదించే వరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజేనేపల్లి శ్రీనివాసరావు, పత్తిపాక నాగ సులోచన, సిపిఎం ఖమ్మం డివిజన్ నాయకులు 31 డివిజన్ కార్పొరేటర్ యర్రా గోపి, షేక్.హిమామ్, యర్రా . రంజిత్, సిపిఎం సీనియర్ నాయకులు బండారు యాకయ్య,వ్యాపార వర్గాల నాయకులు బండారు వీరబాబు, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు యర్రా మల్లికార్జున్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ నాయకులు షేక్ బాబు, పోతురాజు జార్జి, షేక్ ఖాసిం, సోమవారపు సుధీర్, యర్రా నగేష్, షేక్ మస్తాన్, కన్నె కంటి శ్రీనివాసచారి, తదితరులు పాల్గొన్నారు.




## మలిదశ ఉద్యమకారుడు జడల వెంకటేశ్వర్లు మృతి

### -ఎంపీ వద్దిరాజు నివాళి



**ఖమ్మం బ్యూరో, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, వైరా నియోజకవర్గం కారేపల్లి మండల కేంద్రానికి చెందిన జడల వెంకటేశ్వర్లు కొద్ది సేపటి క్రితమే గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసి రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దిగ్భ్రాంతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ పట్ల నిబద్ధత కలిగి ఉన్న మంచి ఉద్యమ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని నివాళి అర్పించారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా చురుకుగా పాల్గొంటూ, పార్టీ పట్ల తన అభిమానాన్ని చాటుకునే వారని కొనియాడారు. కారేపల్లి మండలంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తుది శ్వాస వరకు పాటు పడిన మంచి ఉద్యమకారుడిని కోల్పోవడం బీఆర్ఎస్ పార్టీ కి.. తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. జడల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు, తోటి ఉద్యమకారులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## 30 ఏళ్ల తర్వాత ఓటేశా.. పులివెందుల బ్యాలెట్ బాక్స్‌లో ఓటరు మెసేజ్..!



**పులివెందుల,14 ఆగస్టు (కెరటం న్యూస్):** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల కౌంటింగ్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. 25 ఓట్లను ఒక కట్టగా కట్టేటప్పుడు అందులోనుంచి ఓ స్లిప్ బయటపడింది. ఓ అజ్ఞాత వ్యక్తి దాన్ని రాసి బ్యాలెట్ బాక్స్‌లో వేశాడు. 30 ఏళ్ల తర్వాత ఓటు వేసినందుకు సంతోషంగా ఉందని ఓటరు అందులో పేర్కొన్నారు. చాలా ఏళ్లుగా ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నా.. ప్రజలను పోలింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## జడల వెంకటేశ్వర్లు మృతి పట్ల మాజీ ఎంపీ నామ దిగ్భ్రాంతి





**హైదరాబాద్ బ్యూరో, 14 ఆగష్టు (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా వైరా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కారేపల్లి మండల నివాసి జడల వెంకటేశ్వర్లు అకాల మరణం పట్ల మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం ఖమ్మం కార్పొరేషన్ లో ఉద్యమకారులతో కలిసి డోకుమర్తి సుబ్బారావు ఇంటి వద్ద కలసినప్పుడు ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన జడల వెంకటేశ్వర్లు ఇప్పుడు మన మధ్య లేరు అనే విషయం నమ్మలేకపోతున్నా అని నామ భావోద్వేగానికి లోనయ్యారు. ఆయనతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం, కారేపల్లి మండల అభివృద్ధికి చేసిన కృషి ఎప్పటికీ స్మరణీయమని కొనియాడారు. తాను పదిహేను, పదిహేడవ లోక్‌సభల్లో పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎప్పుడైనా మండల సమస్యలు వచ్చినప్పుడు తనతో చర్చించి, పరిష్కారానికి కృషి చేసేవారని గుర్తుచేశారు. జడల వెంకటేశ్వర్లు మరణం బీఆర్ఎస్ పార్టీకి, అలాగే వైరా నియోజకవర్గానికి తీరని లోటు అని నామ అన్నారు. వారం రోజుల వ్యవధిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇద్దరు ఉద్యమకారులు అకాల మరణం చెందడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జడల కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ, నామ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# లియాండర్ పేస్ తండ్రి.. మేటి హాకీ ప్లేయర్ వెసీ పేస్ కన్నుమూత



స్పోర్ట్స్ న్యూస్,14 ఆగస్టు (కెరటం న్యూస్):భారత హాకీ జట్టు మాజీ ఆటగాడు వెసీ పేస్ గురువారం కన్నుమూశారు. 1972లో ముచిచ్ లో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో ఆడిన భారత జట్టుకు ఆయన ప్రాతినిధ్యం వహించాడు. ఆ మెగా క్రీడల్లో ఇండియా హాకీ జట్టుకు కాంస్య పతకం దక్కింది. దిగ్గజ టెన్నిస్ ప్లేయర్ లియాండ్ పేస్ తండ్రి ఈయనే. వెసీ పేస్ వయసు 80 ఏళ్లు. గురువారం ఆయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వెసీ పేస్ పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారు. కోల్‌కతాలోని సిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు.భారత క్రీడా చరిత్రలో వెసీ పేస్‌కు ప్రత్యేక స్థానం ఉన్నది. భారత హాకీ జట్టులో ఆయన మిడ్‌ఫీల్డర్‌గా ఆడాడు. ఫుట్‌బాల్, క్రికెట్, రగ్బీ లాంటి అనేక క్రీడల్లోనూ వెసీ పేస్‌కు ప్రావీణ్యం ఉన్నది. 1996 నుంచి 2022 వరకు ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు. స్పోర్ట్స్ మెడిసిన్ డాక్టర్‌గా కూడా ఆయనకు గుర్తింపు ఉన్నది. అనేక క్రీడా సంఘాలకు మెడికల్ కన్సల్టెంట్‌గా చేశారు. ఆసియా క్రికెట్ మండలి, బీసీసీఐ, డేవిస్ కప్ జట్టుకు మెడికల్ కన్సల్టెంట్‌గా చేశారు.

# సైలెంట్‌గా నిశ్చితార్థం చేసుకున్న సచిన్ కుమారుడు.. అమ్మాయి ఎవరో తెలుసా?



స్పోర్ట్స్ న్యూస్,14 ఆగస్టు (కెరటం న్యూస్): భారత క్రికెట్ లెజెండ్, మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ తాజాగా నిశ్చితార్థం చేసుకున్నాడన్న వార్తలు సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తున్నాయి. ముంబైకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు సానియా చందోక్‌తో అర్జున్ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై టెండూల్కర్ కుటుంబం లేదా ఘాయ్ కుటుంబం ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. రెండు కుటుంబాల సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో అర్జున్, సానియా చందోక్ ఉంగరాలు మార్చుకున్నట్టు ఓ ప్రముఖ పత్రిక రాసుకొచ్చింది.

అర్జున్, సానియా ఎంగేజ్‌మెంట్‌కి కేవలం కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరయినట్టు తెలుస్తుంది. అర్జున్‌తో సానియా నిశ్చితార్థం జరిగిందని తెలిసి అందరు ఆమె ఎవరనే ఆరాలు తీస్తున్నారు. సానియా చందోక్ ముంబైకి చెందిన ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందినవారు కాగా, ఆమె Mr. Paws Pet Spa & Store LLP లో డిజిగ్నేటెడ్ పార్టనర్‌గా, డైరెక్టర్‌గా ఉన్నారు. ఘాయ్ కుటుంబం హాస్పిటాలిటీ, ఫుడ్ ఇండస్ట్రీల్లో ప్రసిద్ధి చెందింది. వారు ఇంటర్ కాంటినెంటల్ హొటల్‌తో పాటు ప్రసిద్ధ ఐస్‌క్రీమ్ బ్రాండ్ బ్రూక్లిన్ క్రీమరీ ను కూడా నిర్వహిస్తున్నారు. పబ్లిక్‌కి దూరంగా ఉండడాన్నే సానియా ఇష్టపడతారని సమాచారం.

ఇక అర్జున్ టెండూల్కర్ విషయానికి వస్తే తన ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌ను 2020/21 దేశీయ సీజన్‌లో ముంబై తరఫున హర్యానాతో జరిగిన టి20 మ్యాచ్‌తో ప్రారంభించాడు. ఆ తర్వాత అవకాశాల కోసం 2022/23 సీజన్‌లో గోవా జట్టుకు మారాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 17 మ్యాచ్‌లు,532 పరుగులు ,1 సెంచరీ ,2 హాఫ్ సెంచరీలు , 37 వికెట్లు, ఒకసారి ఐదు వికెట్ల ఘనత సాధించాడు. ఐపీఎల్ లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన అర్జున్.. 73 బంతులు వేసి 3 వికెట్లు తీసాడు. బౌలింగ్ అత్యుత్తమ గణాంకం 1/9 గా నమోదు చేశాడు. ఎకానమీ రేట్ 9.36 కాగా, స్ట్రైక్ రేట్ 24.3. బ్యాటింగ్‌లో తొమ్మిది బంతుల్లో 13 పరుగులు చేసి, 144.44 స్ట్రైక్ రేట్ సాధించాడు. ఆయన అత్యధిక స్కోరు 13 పరుగులు మాత్రమే. అయితే తండ్రి సచిన్ లాగే అర్జున్ కూడా క్రికెట్ ప్రపంచంలో తనదైన ముద్ర వేయాలని కృషి చేస్తున్నాడు.


# టాలీవుడ్ కు దూరంగా.. కోలీవుడ్.. మాలివుడ్ లో యంగ్ బ్యూటీ బిజీ

మూవీ న్యూస్, 14 ఆగష్టు (కెరటం న్యూస్): ప్రైవేట్ ఆల్బమ్స్‌తో పాపులరైన ప్రీతి ముకుందన్ టాలీవుడ్ ఫిల్మ్ ఓం భీమ్ బుష్‌తో యాక్టింగ్ కెరీర్ స్టార్ట్ చేసింది. హారర్ కామెడీ కంటెంట్ వల్ల హీరోయిన్ పెద్దగా రిప్రజెంట్ కాలేదు కానీ సినిమా మాత్రం సూపర్ హిట్. అదే టైంలో కోలీవుడ్‌లో స్టార్ అనే మూవీతో తెరంగేట్రం చేసింది. ఆ సినిమా కూడా కమర్షియల్‌గా సక్సెస్. ఈ టూ ఫిల్మ్స్ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న ఆమెకు కన్నప్ప రూపంలో బిగ్ ఆఫర్ తగిలింది. నుపుర్ సనన్ తప్పుకోవడంతో ఆఫర్ ప్రీతిని వరించింది. కన్నప్పతో హ్యాట్రిక్ హిట్ కొట్టి గోల్డెన్ లెగ్ ట్యాగ్ తీసుకుందామనుకున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్ ఫ్లాప్ చవిచూసింది. సినిమాలో ప్రీతి నటించింది అన్నమాటే కానీ మేడమ్ ప్రమోషన్లలో పాల్గొనలేదు. కానీ సినిమాలో గ్లామర్ షో, ఇంటిమసీ సీన్లలో తన స్టఫ్ ఇచ్చేసింది. యూత్ నయా గర్ల్ ఫ్రెండ్‌గా మారిపోయింది. టాలీవుడ్, కోలీవుడ్ తెరంగేట్రం సక్సెస్ ఫుల్‌గా కంప్లీట్ కావడంతో పాటు రిజల్ట్ పాజిటివ్‌గా రావడంతో నెక్ట్స్ మల్లూవుడ్‌లో లక్ టెస్ట్‌కు రెడీ అవుతోంది భామ. మైనే ప్యార్ కియా అంటూ మాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది ప్రీతి ముకుందన్. హృదు హరూన్ హీరోగా నటిస్తోన్న ఈ ఫిల్మ్ రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. ఆగస్టు 29న ఓనమ్ కి రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఇప్పుడిప్పుడే మలయాళంలో రిజిస్టర్ అవుతోన్న ఎలక్ట్రానిక్ కిలీ మ్యూజిక్ డైరెక్టర్. మైనే ప్యార్ కియానే కాదు ప్రీతి చేతిలో మరో మాలీవుడ్, రెండు తమిళ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. కానీ కన్నప్ప తర్వాత టాలీవుడ్ ఆఫర్స్ వచ్చిన దాఖలాలు లేవు. మరి కన్నప్ప వల్ల మేడమ్ హర్ట్ అయ్యిందో లేక ఆఫర్లు రావట్లేదో కొత్త సినిమా కబురు చెప్పలేదు. మళ్లీ ప్రీతి టాలీవుడ్ తలుపు తడితే చూడాలనుకుంటున్నారు ఇక్కడి ఆడియన్స్.



# జింక అనుకునే సింహం ఏం చేసిందంటే?

మూవీ న్యూస్, 14 ఆగష్టు (కెరటం న్యూస్): జాతరలు, పండగలతో ప్రశాంతంగా ఉండేది రేపల్లె గ్రామం. కానీ అక్కడున్న అడవిగుట్టలో అమ్మాయిలు అదృశ్యమవుతూ ఉంటారు. ఆ ఊరికే మొదటి లేడి కానిస్టేబుల్‌గా వచ్చిన కనకమహాలక్ష్మి ఈ కేసును ఛేదించడానికి రంగంలోకి దిగుతుంది. మరి ఈ సమస్యను ఆమె ఎలా పరిష్కరించిందో తెలుసుకోవాలంటే 'కానిస్టేబుల్ కనకం' సిరీస్ చూడాల్సిందే. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ తెరకెక్కించిన సిరీస్ ఇది. రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. "సింహం, చిరుత.. ఇలాంటి మృగాలు ఎన్ని చేసినా ఆ జింక బెదరలేదు.. ఎందుకంటే.. అది జింకే కాదు" అంటూ ఇటీవలే జానపద పాట రూపంలో విడుదలైన ట్రైలర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. మరి అందరూ జింక అనుకునే ఆ సింహం ఈ కేసును ఎలా పరిష్కరించిందో మీరూ చూడండి.



# శిల్పా శెట్టి దంపతులపై కేసు నమోదు

మూవీ న్యూస్, 14 ఆగష్టు (కెరటం న్యూస్): ముంబయికి చెందిన ఓ వ్యాపారవేత్తను మోసం చేశారన్న అభియోగాలపై నటి శిల్పా శెట్టి దంపతులపై కేసు నమోదైంది. పెట్టుబడి ఒప్పందానికి సంబంధించి రూ.60 కోట్లు మోసం చేశారని శిల్పా శెట్టి , రాజ్ కుంద్రాలపై దీపక్ కొఠారి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జుహు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దీనిని ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేయగా.. ప్రస్తుతం ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.



2015- 2023 వరకు ఓ వ్యాపార ఒప్పందం నిమిత్తం రూ.60.48 కోట్లు ఇచ్చానని, కానీ ఆ డబ్బును వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించుకున్నారని దీపక్ కొఠారి ఆరోపించారు. షాపింగ్ ప్లాట్‌ఫామ్ బెస్ట్ డీల్ టీవీకి వారు డైరెక్టర్లుగా ఉన్న సమయంలో దీపక్ ఒప్పందం చేసుకున్నారు. అప్పటికి ఆ కంపెనీలో 87 శాతం కంటే ఎక్కువ వాటా కలిగి ఉన్నారు. 2016 ఏప్రిల్‌లో తనకు శిల్పా శెట్టి వ్యక్తిగత హామీ కూడా ఇచ్చారని దీపక్ తెలిపారు. ఆ తర్వాత కొన్ని నెలలకే ఆమె డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారని, ఈ విషయాన్ని బయటకు చెప్పలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆ కంపెనీ దివాలా తీసిన విషయం తెలిసిందని చెప్పారు.

**ఈ వార్తలు అవాస్తవం: శిల్పా శెట్టి లాయర్**

ఈ కేసుపై శిల్పా శెట్టి లాయర్ స్పందించారు. మీడియాలో వస్తోన్న ఆరోపణలను ఖండించారు. ఈ కేసుపై గతేడాదిలోనే తీర్పు వెలువడిందని చెప్పారు. ఇందులో శిల్పాశెట్టి దంపతులకు ఎటువంటి ప్రమేయం లేదన్నారు.